# ఈ కథ అమ్మకానికి కాదు!



**"మీకో గుడ్ న్యూస్!" అంటూ నవ్వుతూ కాఫీ అందిస్తున్న శ్రీమతిని చూడగానే, రాస్తున్న కథను పక్కను పెట్టి, "ఏమిటట?" అని అడిగాను.**

## గుడిసేవ సుందర రామయ్య

"నా సమస్యకు పరిష్కారం దొరికింది. రేపట్నుంచి ఎంచక్కా ఎన్నో పుస్తకాలు చదువుకోవచ్చు!" అంది ఆనందంగా.

"ఏదైనా లైబ్రరీలో చేరావా?" కాఫీ సిప్ చేస్తూ అడిగాను.

"నో, లైబ్రరీయే నన్ను వెతుక్కుంటూ వచ్చింది. ఇప్పుడే వస్తానుండండి!" అంటూ హాల్లోకి వెళ్లింది శ్రీమతి.

మా శ్రీమతికి పుస్తకాలు చదవటమంటే మహా సరదా. విశాఖపట్నంలో ఉండగా ఆఫీసులోనే ఓ చక్కని లైబ్రరీ ఉండేది. అందుచేత మా శ్రీమతికి చాలా పుస్తకాలు తెచ్చిపెట్టేవాణ్ని. హైదరాబాదు ట్రాన్స్‌ఫర్ అయ్యాక ఉద్యోగరీత్యా పుస్తకాల గురించి ఆలోచించటానికే తీరిక లేకుండా పోయింది. నేను పుస్తకాలు తీసుకురావడం లేదని గత మూడు నెలలుగా మా శ్రీమతి పోట్లాడుతూ ఉంది.

"మీరోసారి హాల్లోకి రండి!" అంటూ నన్ను పిల్చేసిరికి ఆలోచనలను కట్టిపెట్టి హాల్లోకి వెళ్లాను.

"వీరే మా వారు!" అంటూ నన్ను ఓ వ్యక్తికి పరిచయం చేసింది.

కళ్లజోడు పెట్టుకున్న కుర్రాడు కనిపించాడు. వయస్సు సుమారు పాతిక సంవత్సరాలుండవచ్చు. చేతిలో పుస్తకాలు ఉన్నాయి.

"నమస్కారం, సార్! నా పేరు రాందాసు. మాకు దోమల్‌గూడలో సర్క్యులేషన్ లైబ్రరీ ఉంది. మేడమ్ గారిని మెంబర్‌షిప్ కట్టమన్నాను!" అంటూ ఓ కాగితాన్ని అందించాడు.

కాగితాన్ని అందుకుని పరిశీలించాను. అందులో పుస్తకాల వివరాలున్నాయి. తెలుగు, తమిళం, హిందీ, మళయాళం, ఇంగ్లీషు మొదలైన భాషల్లో వెలువడే వార, పక్ష, మాస పత్రికల లిస్ట్ ఉంది.

"మీకు ఏం పుస్తకాలు కావాలో గుర్తు పెట్టండి, సార్! రోజూ ఓ పుస్తకం ఇస్తాం. మీరు నాలుగు రోజుల్లోపు రిటర్న్ చేయవచ్చు!" అన్నాడు.

"ఎంత కట్టాలి?" అని అడిగాను.

"మెంబర్‌షిప్ యాభై రూపాయలు. అడ్వాన్స్ ముప్పయి రూపాయలు!" అన్నాడు.

"సరే, కానియ్!" అంటూ కాగితాన్ని శ్రీమతి చేతికి ఇచ్చి వరండాలోకి వెళ్లాను.

కాసేపటికి శ్రీమతి వెనుకనే సౌమ్య, సుష్మ కాగితంతో నా దగ్గరకు వచ్చారు. "డాడీ! మమ్మీకి, నాకు, చెల్లికి కావలసిన బుక్స్ గుర్తు పెట్టాం!" అంటూ సౌమ్య కాగితాన్ని అందించింది.

"సెలెక్షన్ బాగుంది" అన్నాను.

"అయితే ఆలస్యం ఎందుకు డాడీ? ఓ ఎనభై కొట్టు!" అంది సుష్మ.

పర్సు తీసుకుని హాల్లోకి వెళ్లాను.



## టాప్సీ-టర్వీ

అమెరికా న్యూమెక్సికోలోని ఆల్బుకర్కీ అనే ఊరికి చెందిన జాన్ని కజయన్(36) గంటకి 185 మైళ్ల వేగంగల సింగిల్ ఇంజన్ విమానంమీద ఎక్కి ప్రయాణించాడు. ఆ విమానం తలకిందులుగా కూడా కొంతదూరం ప్రయాణించింది. విమానంమీంచి పడిపోకుండా కట్టుకుని ఇత నీ సాహసాన్ని కెమేరా లెన్స్‌లకోసం చేశాడు. ఓ కెనడియన్ టి.వి. సీరియల్‌లో తర్వాత ఈ ఫుటేజ్‌ని వాడుకున్నారు. దీన్ని సీరియల్‌లో చూపించడానికి ఏడుగురు రచయితలు శ్రమించారుట.

-డి. పద్మజ

"మీ పేరు చెప్పండి, సార్! ఫ్లాట్ నంబరెంత?" అంటూ వివరాలు అడిగాడు.

నేను చెబుతుంటే అన్నీ నోట్ చేసుకున్నాడు. ఓ రెండు కొత్త వీక్లీలు తీసి నాకు అందించాడు. "రేపు ఆదివారం కనుక రేపటి పుస్తకం కూడా ఈ రోజే ఇస్తున్నాను, సార్!" అన్నాడు.

పుస్తకాలు అందుకుని ఎనభై రూపాయలు అతనికి ఇచ్చాను.

"థాంక్యూ, సార్! మళ్లీ సోమవారం వస్తాను!" అంటూ వెళ్లిపోయాడు.

నేను ముఖం కడుక్కుని టీ తాగి కాయగూరల కోసం బజారు బయలుదేరాను. ఓ గంట తర్వాత ఇంటికి వచ్చాను.

నేను వచ్చేసరికి ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. మా శ్రీమతి దిగాలుగా సోఫాలో కూర్చుంది.

నన్ను చూడగానే "మనం మోసపోయామండీ!" అంది.

అర్థంకానట్లు చూశాను.

"వాడేనండీ! పుస్తకాలిచ్చిన వెధవ! మనతోపాటు మరో రెండు ఫ్లాట్స్‌లో కూడా డబ్బు తీసుకుపోయాడట!"

"వాడెక్కడికి పోతాడోయ్! సోమవారం వస్తాడుగా!"

"అయ్యో రామ! ఇంకెక్కడ వస్తాడు? మనం ఐదు వందల నోటు చిల్లర అడిగామని చెప్పి కింద ఫ్లాట్‌లో పంజాబీ వాళ్ల దగ్గర వంద రూపాయల నోట్లు అయిదు తీసుకుని పారిపోయాడు. మాకు అనుమానం వచ్చి వాడిచ్చిన అడ్రస్‌కు వెళ్లి వచ్చాం. ఆ పేరు గల లైబ్రరీ ఈ చుట్టుపక్కల లేదట!" అంది శ్రీమతి.

"ఎంత సులభంగా మోసం చేశాడు!" అన్నాను.

"అసలు తప్పంతా మీదండీ! చేతిలో స్కూటర్ ఉంది కదా! ఓసారి వెళ్లి ముందుగానే అడ్రస్ వాకబు చేసి డబ్బు కడితే బాగుండేది కదా!" అంది నిందారోపణ చేస్తూ.

"మహాతల్లీ! వాడు చీట్ చేశాడు కాబట్టి ఇలా మాట్లాడుతున్నావు. అసలు నేను డబ్బు కట్టకుండా ఉంటే ఈ రోజంతా నాతో పోట్లాడుతూండేదానివి. నీ నోటికి భయపడే అంత త్వరగా డబ్బిచ్చాను!" అన్నాడు.

"బాగానే ఉంది మీ వరస!" అంటూ సోఫాలోంచి లేచింది.

"డోంట్ వర్రీ శ్రీమతీ! వీక్లీలు ఇచ్చాడు కదా! మనం నష్టపోయింది డెబ్బయి రూపాయలు. చూస్తూ ఉండు, నెల రోజుల్లో ఆ డబ్బు వచ్చేట్లు చూస్తాను!" అంటూ లోపలికి వెళ్లాను.

నెల రోజుల తర్వాత... పోస్ట్‌లో వచ్చిన ఓ వారపత్రికను నాకు అందించింది.

"ఇందులో మీరు రాసిన కథ అచ్చయింది. పోయిన డబ్బును నెలరోజుల్లో సంపాదిస్తానన్నారు. ఇలా వాడిమీద కథ రాసి కాష్ చేసుకుంటున్నారన్నమాట! ఓ రకంగా చూస్తే మీరు కూడా వాడి కోవకే చెందుతారేమో?" కటువుగా అంది శ్రీమతి.

శ్రీమతి అజ్ఞానానికి నవ్వొచ్చింది. "పిచ్చిదానా! అసలు విషయం నీకు అర్థం కాలేదు. నీలాంటి పుస్తకప్రియులు ఈ మహానగరంలో ఎందరో ఉన్నారు. వాళ్లంతా మనలా రాందాసులాంటి వాళ్ల చేతిలో మోసపోకూడదు. అందుకే ఈ కథ రాశాను. అంతేకానీ, కథ అమ్మి డబ్బు సంపాదించటం నా లక్ష్యం కాదు!"

శ్రీమతి నిశ్చేష్టురాలైంది. ■